# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



**WANTED** విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



సంపుటి : 01 | సంచిక : 259 | వరంగల్ | మంగళవారం, 14 జులై 2026 | పేజీలు : 02




## ఉమ్మడి వరంగల్ జిల్లాకు

# పెద్ద దిక్కు దేవాదుల పథకం

- 10 నియోజకవర్గాలకు దేవాదుల ద్వారా సాగు నీరు
- మేడిగడ్డ పని చేయకపోతే కాళేశ్వరం పని చేయదు
- రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ నాయకులు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**పాలకుర్తి వాణి, స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి :** రైతులకు సాగు నీరు అందించాలి, పంటలు పండించాలనే ఏ ప్రభుత్వం అయిన ఆలోచిస్తుందని కానీ ప్రతిపక్షాలు వాస్తవాలను, సాంకేతిక విషయాలను తెలుసుకోకుండా ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏటూరునాగారం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్ట్ పంపు హౌస్ పరిశీలన, సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా సాగు నీరు, త్రాగు నీరుకు పెద్ద దిక్కు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు మాత్రమే అని అన్నారు. రైతులకు సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు అందిస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రులు మల్లు బట్టి విక్రమార్క, ఉత్తమ కుమార్ రెడ్డి కు ఋణపడి ఉంటారని విజ్ఞప్తి చేశారు.నా రక్తాన్ని చమటగా మార్చి నేనే ఇంజనీర్ అయి కాళేశ్వరం కట్టానని కేసీఆర్ అనేక సార్లు చెప్పాడని కానీ నిర్మాణ లోపాల వల్ల కాళేశ్వరం కుంగి పోయిందని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఒక్క మెడిగడ్డ కుంగిపొతే కన్నెపల్లి నుండి లిఫ్ట్ చేయచ్చు కదా, గేట్లు దించకుండా ప్రవాహాన్ని బట్టి లిఫ్ట్ చేయచ్చు కదా అని రైతులను, ప్రజలను తప్పు దోవ పట్టించే మాటలు మాట్లాడుతున్నారని అన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, పాలకుర్తి వాణి:** తమ సమస్యలను అధికారులు తప్పకుండా పరిష్కరిస్తారు అనే నమ్మకాన్ని ప్రజలకు ప్రతి శాఖ అధికారులు కలిగించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన వినతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులకు ఆయా వినతులను ఇచ్చి, క్షేత్రస్థాయిలో విచారణ చేసి, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 335 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# విద్యే యువతకు అతిపెద్ద ఆస్తి

- తన జీతంతో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ
- 90 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి వాణి, తొర్రూరు:** రాజకీయాల్లో ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇస్తూ, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తూ ముందుకు సాగుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే మావిడాల యశస్విని రెడ్డి మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రజాప్రతినిధిగా లభిస్తున్న తన జీతాన్ని ప్రజల సంక్షేమానికి వినియోగిస్తూ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే మహోన్నత లక్ష్యంతో స్వంత నిధుల ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమానికి యువత నుంచి విశేష స్పందన లభించగా, తొలి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 90 మంది విద్యార్థిని, విద్యార్థులకు తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్వయంగా సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ విద్యే యువతకు అతిపెద్ద ఆస్తి, నైపుణ్యమే భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి, ప్రతి ఉద్యోగార్థికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిక్షణకు దూరమవుతున్న యువతకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో తన జీతంలో నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి యువకుడు, యువతి ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాకుండా ప్రైవేట్ రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను యువత తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు.యువత సాధికారతే సమాజ అభివృద్ధికి మూలస్తంభమని, విద్య, నైపుణ్యం, ఉపాధి అనే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, ఎక్కువ మంది యువతకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు ముత్తినేని సోమేశ్వర్ రావు, కౌన్సిలర్ పార్టీ సీనియర్ నాయకులు బాపు రెడ్డి, పట్టణ అధ్యక్షులు ముద్దసాని సురేష్, మండల అధ్యక్షులు రవీంద్ర చారి, మాజీ మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుండాల నర్సయ్య, చిత్తలూరి శ్రీనివాస్, పట్టణ యువజన అధ్యక్షులు మహేష్ యాదవ్, మహబూబ్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, శిక్షణ సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థుల, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకుర్తి వాణి | 2 | epaper.palakurthivani.com
మన పల్లె.. మన ముచ్చట్లు | మంగళవారం, 14 జులై 2026

# నేటి తరానికి పోతన ఆదర్శాలు అందిస్తాం

- నెల్లుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 'పోతన సాహితి పద్యనాటకోత్సవాలు.
- తెలంగాణలోని 33 జిల్లాల్లో పోతన పద్యనాటక ప్రదర్శనలు
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** రాజ్యాధికారానికి లొంగకుండా తన కావ్యాన్ని భగవంతుడికే అంకితం చేసిన ధిక్కార స్వరం, మహాకవి బమ్మెర పోతన జీవిత ప్రస్థానాన్ని విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు అన్నారు.
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, నెల్లుట్ల ఫౌండేషన్, కవులు కళాకారుల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో జనగాం జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలోని 'పోతన స్మృతి వనం'లో ఆదివారం రాత్రి 'పోతన సాహితి పద్యనాటకోత్సవాలు' ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ప్రారంభిస్తూ నెల్లుట్ల రవీందర్ రావు ప్రసంగించారు. నాటి రాజుల ప్రలోభాలకు లొంగకుండా, తన గ్రంథాన్ని నరులకు అంకితం ఇవ్వనని ప్రకటించిన ఘనత పోతనకే దక్కుతుందని కొనియాడారు. పోతన మన ప్రాంతానికి చెందినవాడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. పోతన నడయాడిన, హలం పట్టి పొలం దున్నిన పుణ్యభూమి బమ్మెర అని ఆయన స్మరించుకున్నారు. పోతన జీవిత విశేషాలతో రూపొందించిన ఈ పద్యనాటకాన్ని తెలంగాణలోని అన్ని (33) జిల్లాల్లో ప్రదర్శించి, నేటి తరానికి ఆయన ఆదర్శాలను అందిస్తామని ఈ సందర్భంగా రవీందర్ రావు ప్రకటించారు. తొలుత మహబూబ్ బాద్,హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు గా పద్యనాటకాలు ప్రదర్శనలు ఇస్తామని తెలిపారు.

**ఆకట్టుకున్న పద్యనాటకం కవిసమ్మేళనం**

ఉత్సవాల్లో భాగంగా చింతలపాటి శూలపాణి నేతృత్వంలో ప్రదర్శించిన 'పోతన జీవితం' పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కళాకారుల నటన, పద్య పఠనం నాటకానికి ప్రాణం పోశాయి. అనంతరం 'కవి హృదయం సాహిత్య సంస్థ' అధ్యక్షులు పెట్లోజు సోమేశ్వరా చారి అధ్యక్షతన ఘనంగా కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన కవులు పాల్గొని, పోతన భక్తితత్వాన్ని, తెలంగాణ సాహిత్య వైభవాన్ని చాటిచెబుతూ కవితాగానం చేశారు.మహిళ కళాకారిణిలు కోలాట ప్రదర్శన ఇచ్చారు.

**ఘన నివాళులు సత్కారాలు.**

కార్యక్రమం ప్రారంభానికి ముందు అతిథులు, కవులు, కళాకారులు బమ్మెరలోని పోతన సమాధిని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సమాజానికి, సాహిత్యానికి సేవ చేస్తున్న పలువురు కవులను, కళాకారులను నిర్వాహకులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ సాంస్కృతిక మహోత్సవంలో బమ్మెర గ్రామ సర్పంచ్ జిట్టబోయిన రమ్య ప్రశాంత్, ప్రముఖ ప్రజా వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, వీణావాణి, శర్మ, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, ప్రముఖ సాహితీవేత్తలు జి. కృష్ణ, అయిలా సోమనర్సింహాచారి, డాక్టర్ వేముల సదానందం, మాన్యపు భుజేందర్, రాపాక సత్యనారాయణ, దేవసాని ఉపేందర్, ఉపసర్పంచి బత్తిని సురేష్, రాసాల ప్రభాకర్, సోమసత్యం,సోమ ఆశోక్ బాబు, మధన్ మోహన్, గుడికందుల నరేష్, శివరాత్రి కొంరయ్య, ఉడుత నరేష్,రంగరాజు ప్రసాద్, కొత్తోజు నాగాచారి, ఏనుగు తల సోమేశ్వర్, పసుల నర్సింహ, నాయకులు, ప్రజలు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆశీర్వాదం...

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ మెండె సతీష్ రమ ల కూతురు సారి ఫంక్షన్ శుభం కన్వెన్షన్ హాల్లో జరగగా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరు భార్గవ్, శోభన్, అశోక్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.




# విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

**పాలకుర్తి వాణి, జఫర్‌గఢ్ :** చిన్నారుల్లో నులిపురుగుల సమస్యను నివారించేందుకు అల్బెండజోల్ మాత్రల ఎంతో ఉపయోగపడతాయని కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి నవీన అన్నారు. జఫర్గడ్ మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి నవీన నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.

# పాలకుర్తిలో రైతు భరోసా సంబరాలు

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ప్రభుత్వం రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రోజుల వ్యవధిలో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గిరగాని కుమార్ గౌడు, రైతు ఏటీఎం చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, చాకలి ఐలమ్మ మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్, పాలకుర్తి గ్రామ పార్టీ అధ్యక్షుడు కమ్మగానే నాగన్న గౌడ్,చిలువేరు కృష్ణమూర్తి, ఎండి మదర్, ఎండి యాకుబ్, కామారపు సునీల్,గాదపాక భాస్కర్,బాల గాని యాకయ్య, పులి గణేష్ గౌడు, ఎల్లయ్య వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.





# ఆర్థిక, అక్షరాస్యత పై శాతపురంలో అవగాహన

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సహకారంతో జనగాం జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం పై పాలకుర్తి డిసిసి బ్యాంకు మేనేజర్ శ్రీ కే ప్రసాద్ నిర్వహించారు. సైబర్ నేరాల గురించి, ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలు , రుణాలు బ్యాంకులో డిపాజిట్ల, బ్యాంకు సేవల పై వివరంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ లోనే శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీ పసులాది యాకయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శ్రీ. సమ్మయ్య ఎల్లరాయిని తొర్రూరు సొసైటీ సీఈవో శ్రీ యం. రణధీర్ , సంఘ డైరెక్టర్లు, సంఘ సిబ్బంది,గ్రామ ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో కిక్కిరిసిన సోమేశ్వర ఆలయం

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి, సోమవారం ఒకే రోజు రావడంతో జనగామ జిల్లా పాలకుర్తిలోని స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగగా, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మాస శివరాత్రి సందర్భంగా చండికాసమేత శ్రీ సోమేశ్వరస్వామి మాస కళ్యాణం అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆరుద్రోత్సవంలో పంచహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, నాగహారతులతో గర్భాలయ దీపోత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈవోలు భాగం లక్ష్మీ ప్రసన్న, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డి.వి.ఆర్. శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, ఆలయ సిబ్బంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341